# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు



WANTED విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745



సంపుటి : 01 | సంచిక : 185 | వరంగల్ | శనివారం, 11 ఏప్రిల్ 2026 | పేజీలు : 02




# ఒక బస్తాకు రూ.2 ఇవ్వాల్సిందే!

- మక్కల కొనుగోలు కేంద్రంలో సిబ్బంది దౌర్జన్యం
- పాలకుర్తి మార్కెట్ యార్డులో సొసైటీ సిబ్బంది చేతివాటం
- వసూళ్లపై లబోదిబోమంటున్న రైతులు

**పాలకుర్తి వాణి, ప్రత్యేక ప్రతినిధి :** నియోజకవర్గ కేంద్రంలోని సొసైటీ మక్కల కొనుగోలు కేంద్రంలో లుకలుకలు ఆలస్యంగా బయటికి వస్తున్నాయి. సిబ్బంది ఇష్టానుసారంగా రైతుల వద్ద నుంచి పైసలను వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే కాంటా వేస్తామని సొసైటీ సిబ్బంది చెప్పడంతో చివరకు చేసేదేమీ లేక రైతులు వారు అడిగినట్లు ముట్టజెప్పుతున్నారు. ఈ విషయం బయటికి పొక్కడంతో హుటాహుటిన దిద్దుబాటు చర్యలు చేపట్టారు. వివరాల్లోకెళ్తే.. నాలుగు రోజుల క్రితం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చాకలి అయిలమ్మ మార్కెట్ యార్డులో మక్కల కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటినుంచి కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయి. రైతులు మక్కల రాశులను ఆరబెట్టుకొని తూర్పాలు పట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. ఏఈఓల అనుమతితో మార్కెట్ యార్డులో విక్రయిస్తున్నారు. ఇది అదునుగా భావిస్తున్న కొందరు సిబ్బంది రైతుల వద్ద నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక బస్తాకు రెండు రూపాయలు ఇస్తేనే కాంటా లారీలలో తరలిస్తామని చెప్పి దండుకుంటున్నారు. లేకపోతే ఆలస్యం చేస్తామని సాకులు చెప్పి రైతన్నలను బెదిరిస్తున్నారు. దీంతో చేసేది ఏమీ లేక.. గత్యంతరం లేక రైతులు బస్తాకు రెండు రూపాయలు చొప్పున ముట్టజెబుతున్నారు. ఈ విషయాన్ని కొందరు రైతులు పాలకుర్తి వాణి ప్రతినిధికి ఫోన్ చేసి తెలియజేశారు. అక్రమ వసూళ్లపై సొసైటీ సిబ్బందిని వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని సమాధానం ఇచ్చారు. ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మంజుల భాస్కర్ నాయకును వివరణ కోరగా నేడు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రజల భద్రతే ప్రభుత్వ ధ్యేయం : కలెక్టర్

**పాలకుర్తి వాణి, జనగామ:** ప్రజల భద్రతే ప్రభుత్వ ధ్యేయమని, ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం అమలుపై కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 13 నుంచి 18 వరకు చేపట్టనున్న అరైవ్ - అలైవ్ కార్యక్రమాలను జిల్లాలో విస్తృత స్థాయిలో నిర్వహించాలని పేర్కొన్నారు. ఏసిపి పండరి చేతన్ నితిన్, ఆర్డీఓ వెంకన్న, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఎక్సైజ్ ఎస్పీ అనిత, ఆర్టీఏ సభ్యులు అభి గౌడ్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## జీహెచ్ఎంసీలో తారాస్థాయిలో

# అవినీతి అక్రమాలు!

- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలో పనులన్నీ టెండర్లతోనే ఇవ్వాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, పాలకుర్తి వాణి :** జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలో పనులన్నీ టెండర్లతోనే ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. టెండర్లు లేకుండానే కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్ట్ లను సీఎం తన అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాదాపుగా 1148 కోట్ల రూపాయల కాంట్రాక్టులను నామినేషన్ పద్ధతిలో ఇచ్చారని కవిత చెప్పారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. రూ.5 లక్షలకు మించి ఉండే ఏ పని అయినా సరే టెండర్లు పిలవాల్సి ఉన్నా నిబంధనలు ఉల్లంఘిస్తూ కోట్ల రూపాయల పనులను టెండర్లు లేకుండానే కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఇది తెలంగాణ స్టేట్ ఫైనాన్షియల్ కోడ్ ను ఉల్లంఘించటమేనని చెప్పారు. టెండర్లు లేకుండా కాంట్రాక్ట్ ఇవ్వవద్దని 2023 లో ఏర్పాటైన కమిటీ కూడా స్పష్టం చేసిందని కవిత గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 480 కోట్ల రూపాయల పనులను ఇదే విధంగా కట్టబెడితే.. రేవంత్ రెడ్డి సర్కార్ దాన్ని కొనసాగిస్తూ రూ.1,148 కోట్ల పనులను తన అనుచరులకు నామినేషన్ పద్ధతిలో ఇచ్చిందని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు కు సంబంధించిన ఓ కంపెనీ పై వేసిన సిట్ ఏమైందని కవిత ప్రశ్నించారు.




# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**పాలకుర్తి వాణి, కొడకండ్ల :** పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు కొడకండ్ల మండలంలోని గిర్నీ తండా, మొండ్రాయి, పోలకొండ, రామవరం, పాకాల, కొడకండ్ల నర్సింగాపురం, రంగాపురం రేగుల,గ్రామాలలో ఐకెపి సెంటర్ల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నల్ల అండాలు ప్రారంభించారు.అనంతరం వారు కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో కొడకండ్ల మండల అధ్యక్షులు ధరావత్ సురేష్నాయక్, కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్, మాజీ సర్పంచ్ పసునూరి మధుసూదన్, మాజీ ఎంపీటీసీ అందే యాకయ్య, టౌన్ అధ్యక్షులు,మసురం రవీందర్, ఏఎంసీ డైరెక్టర్లు, నా రెడ్డి వెంకట్ రెడ్డి, వలబోజు రమేష్, నామాల ఈదయ్య, బత్తుల వెంకన్న, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు దూదిమేట్లా యూకేష్, మసురం మనోహర్ పాల్గొన్నారు.





# ఆరోగ్యమే లక్ష్యంగా యోగాతో ముందడుగు

**జనగామ, పాలకుర్తి వాణి :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద అయిదో రోజు హోమియోపతి, ఆయుష్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించారు. యోగా శిక్షకులు అందరితో యోగా సాధన చేయించారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో యోగా సాధనను అలవాటు చేసుకోవాలని సూచించారు.



# మొక్కల కేంద్రాలను ప్రారంభించాలి

**పాలకుర్తి, పాలకుర్తి వాణి:** మండలంలోని ప్రతి గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కమిటీ సభ్యులు సోమసత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట ప్లే కార్డ్స్ పట్టుకొని ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ ఎస్ సరస్వతికి అందజేశారు. కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, మొక్కజొన్న రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. బచ్చు శ్రీలత, కౌడగాని మల్లేష్, పోషబోయిన రవి, బొంకూరి సోమయ్య, వంగాల ఎల్లయ్య, బొంకూరు యాదగిరి, ప్రతాప్, శివరాత్రి ప్రశాంత్, నకిర్తి బీరప్ప, దామర సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార భవనం ప్రారంభం

**దేవరుప్పల, పాలకుర్తి వాణి :** దేవరుప్పుల మండల కేంద్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కీలకమైన అడుగుగా విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార భవనాన్ని ప్రారంభించారు. శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమైక్య లిమిటెడ్ (TSDDCF) చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హాజరై భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు. చైర్మన్ మాట్లాడుతూ.. తెలంగాణలో పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. భవనం ప్రారంభంతో దేవరుప్పుల మండలంలో పాడి పరిశ్రమకు కొత్త ఊపు వచ్చి, రైతుల జీవనోపాధి మెరుగుపడుతుందని ఆశిస్తున్నామన్నారు.




# సర్పంచ్ ఎన్నికల ఫలితాలపై ఝాన్సీ రాజేందర్‌రెడ్డి సమీక్ష

**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి:** పాలకుర్తి మండల కేంద్రంలో సర్పంచ్ ఎన్నికలపై సమీక్ష టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జె తొర్రురు, మేకల తండా, కొండాపురం గ్రామాలలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి చెందిన అంశంపై స్థానిక నేతలతో సమాలోచనలు జరిపారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఓటమి కారణాలను లోతుగా విశ్లేషించి భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ బలాన్ని పెంపొందించడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలతో మరింత దగ్గరగా ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు.




# మల్లంపల్లిలో చలివేంద్రం ప్రారంభం

**పాలకుర్తి, పాలకుర్తి వాణి :** జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని మల్లంపల్లి గ్రామంలో కూడలి వద్ద చలివేంద్రాన్ని సర్పంచి పోశాల వెంకన్న గౌడ్ ప్రారంభించారు. ఈ వేసవిలో చలివేంద్రం గ్రామస్తుల దాహార్తి తీర్చడానికి ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. స్థానికులతో పాటు బీకియా నాయక్ తండా, హతియా తండా, ముష్కుల్లగూడెం వాసులకు సైతం ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరిత పాల్గొన్నారు.

# ఆయుష్ మెగా వైద్య శిబిరం

**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి :** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని సర్కారీ వైద్యశాలలో ఆయుష్ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. CHC సూపరింటెండెంట్ పరమేశ్వరి ఆధ్వర్యంలో ఈ శిబిరం చేపట్టారు. జిల్లా నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం సభ్యులు దీర్ఘకాలిక వ్యాధులతో పాటు సీజనల్ గా వచ్చు రోగాలకు చికిత్స అందించారు. మందులు అందజేశారు. పలువురికి మెరుగైన చికిత్స కోసం ఏరియా ఆసుపత్రి తో పాటు వరంగల్ ఎంజీఎం కు రిఫరెన్స్ చేసినట్లు పరమేశ్వరి తెలిపారు. వైద్యాధికారి ఉష పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

**పాలకుర్తి వాణి, జనగామ:** ప్రభుత్వ ఉద్యోగులు కూడా సామజిక కార్యక్రమాలలో పాలు పంచుకోవాలన్న ఉద్దేశ్యం తో... ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపడుతున్నారు. దీనిలో భాగంగా కలెక్టరేట్ లో రక్త దాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్య, వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. డి ఏం ఎచ్ ఓ మల్లిఖార్జున్ రావు, డి సి ఎచ్ ఎస్ నరేందర్ శర్మ , మెడికల్ అధికారులు అన్వర్, దివ్య లతో కలిసి కలెక్టర్ సందీప్ ఝా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ప్రాణదానం తో సమానమన్నారు.




# రైతుల మొబైల్ నెంబర్ ను అప్డేట్ చేసుకోవాలి

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** పాలకుర్తి మండలంలోని గ్రామ రైతులకు Fertilizer Booking App లో రైతుల మొబైల్ నంబర్‌ను అప్డేట్ చేసుకునే అవకాశం లభించిందని మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు., రైతులందరూ తమ మొబైల్ నంబర్‌ను సరిచేసుకోవడానికి లేదా మార్చుకోవడానికి, తమ గ్రామానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) ను సంప్రదించి, Fertilizer Booking App లో తమ ఫోన్ నంబర్‌ను అప్డేట్ చేసుకోవాలని సూచించారు.ఈ అప్డేషన్ ప్రక్రియ ఏప్రిల్ 11 నుండి ఏప్రిల్ 28 వరకు కొనసాగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341